ముఖ్యమంత్రిని దూషిస్తే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయండి

మాజీ ఎమ్మెల్యే హేమలత, హెలెన్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఆగ్రహం

విశాలాంధ్ర- సత్యవేడు:రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ప్రతిపక్ష పార్టీలు దూషిస్తే వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పార్టీ నేతలకు సూచించారు. మంగళవారం టిడిపి కళ్యాణమండపం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహణపై స్థానిక బేరి శెట్టి కల్యాణంలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రిని సత్యవేడు టిడిపి మాజీ ఎమ్మెల్యే హేమలత,ఆమె కూతురు హెలెన్ దూషించడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని దూషించే స్థాయి హేమలతకు లేదన్నారు. సీఎంను దూషిస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయిస్తానని ఆయన స్పష్టం చేశారు.ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లు నువ్వు ఏం చేశావు ప్రజలకు చెప్పాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ భవన నిర్మాణాలు,రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినికులు నిర్మించడం కళ్ళకు కనిపించలేదు అంటూ ఆయన ఎద్దేవ చేశారు. ఇకపై ముఖ్యమంత్రిని దూషిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

తిరుమలలో భక్తులకు అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య చర్యలు

జెఈవో వీరబ్రహ్మం నేతృత్వంలో అధికారుల పర్యవేక్షణ

విశాలాంధ్ర- తిరుపతి : తిరుమలలో విధులు నిర్వహిస్తున్న సులభ్ కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తున్న తరుణంలో టిటిడి పటిష్టమైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా 24 గంటల పాటు పారిశుద్ధ్య చర్యలు చేపడుతోంది.తిరుమలలో ప్రస్తుతం నాలుగు షిఫ్టుల్లో సిబ్బంది సేవలందిస్తున్నారు. వీరికి తోడుగా విశ్రాంతి గృహాల్లో ఎఫ్ఎంఎస్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో చక్కగా పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నారు.అన్న ప్రసాదం కాంప్లెక్స్, వైకుంఠ క్యూ కాంప్లెక్స్ -1, 2, లడ్డూ కాంప్లెక్సుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వివిధ ప్రాంతాల్లో చెత్త తరలింపు, బహిరంగ మరుగుదొడ్లను శుభ్రం చేయడం, రోడ్లు శుభ్రం చేయడం తదితర పనులు చేస్తున్నారు. అదేవిధంగా నాలుగు యంత్రాలతో ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేస్తున్నారు.కాగా, తిరుమలలోని ఆయా ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలను పర్యవేక్షించేందుకు వీలుగా ఎస్ఇ-2 శ్రీ జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుమలలోని ఇఇలు, డెప్యూటీ ఇఇలతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు.టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి ఆదేశాల మేరకు జెఈవో వీరబ్రహ్మం పర్యవేక్షణలో ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి, ఇతర ఉన్నతాధికారులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు.

ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నిర్వహణలో తూకివాకం వద్ద ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ మంగళవారం పరిశీలించారు. అధికారులకు సూచనలు చేస్తూ తిరుపతి నగరంలో ఉత్పత్తి అవుతున్న తడి పొడి చెత్త, భవణ నిర్మాణ వ్యర్థాలు, మురుగు నీరును ఈ ప్లాంట్ ద్వారా రీ సైక్లింగ్ చేయడం వలన మన కార్పొరేషన్ కు జాతీయ స్థాయిలో మంచి పేరుందని, ఇటీవల ఇక్కడి నిర్వహణ సరిగా లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ, ఇకపై అనుకున్న మేర ఈ ప్లాంట్ ద్వారా లక్ష్యాలను సాధించాలన్నారు. తడి చెత్త నుండి సేంద్రీయ ఎరువులు గతంలో రోజుకి 10 టన్నులు ఉత్పత్తి అవుతుంటె నేడు నిర్వహణ లోపించి పూర్తిగా ఎరువులు తయారు చేయకుండా వుండడాన్ని గుర్తించి నిర్వాహకులకు గట్టిగా ఆదేశాలు జారీ చేస్తూ ప్రతిరోజు 70 టన్నుల తడి చెత్తను ఎరువుగా మార్చాల్సిందేనన్నారు. పొడి చెత్త ప్లాంట్ ను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నగరం నుండి వస్తున్న పొడి చెత్తను విభాగాలుగా విభజించి రీ సైక్లింగ్ చేయాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఇటుకలు, టైల్స్ గా మార్చే ప్రకియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. మహేంద్ర బయో గ్యాస్ ప్లాంట్ ను పరిశీలిస్తూ నగరంలోని హోటల్స్ నుండి వ్యర్థంగా పడవేస్తున్న ఆహార పధర్థాలను అధిక మొత్తంలో సేకరించి గ్యాస్ ఉత్పత్తిని పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాంట్లలో ఫైర్ సేఫ్టి వుండాలని, వర్కర్లకి తగిన జాకెట్లు, గ్లౌజులు ఇవ్వాలని కమిషనర్ హరిత ఐఏఎస్ సూచనలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

28న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం ఏడవ స్నాతకోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం యొక్క ఏడవ స్నాతకోత్సవం ఈ నెల 28వ తేదీన ఉదయం 10:30 గంటలకు మహతి ఆడిటోరియంలో జరగనున్నది ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ ఛాన్సలర్ గౌరవనీయులు అబ్దుల్ నజీర్ గారు మరియు టిటిడి చైర్మన్ గారు టిటిడి ఈవో గారు హాజరుకానున్నారు . దాని కొరకు రేపు (26-4-2023) ఉదయం 11 గంటలకు పరిపాలన భవనం రామేశ్వరం నందు కల మీటింగ్ హాల్లో వైస్ ఛాన్సలర్ గారితో పత్రికా మరియు మీడియా సమావేశం ఉన్నది కావున దయతో తమరు హాజరు కాగలరు.

తాళ్లూరు ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ డిస్పెన్సర్ అందజేత

విశాలాంధ్ర - గూడూరు : తాళ్లూరు శ్రీనివాసులు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ సంస్థ చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు మెప్మా ఆఫీస్ లో పొదుపు మహిళల కోసం వాటర్ డిస్పెన్సర్ ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మెన్ శ్రీనివాసులు మాట్లాడుతూ మేప్మా ఆఫీస్ కి వచ్చే పొదుపు మహిళలు ఎండాకాలం దాహంతో ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి రావడంతో వెంటనే ఈ కార్యక్రమం నిర్వహించానని చెప్పారు. అనంతరం గోపాలరెడ్డి డ్వాక్రాలోని సమస్యలను, మహిళలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు.ఈ కార్యమానికి ట్రస్ట్ సభ్యులు సురేంద్ర బాబు, శివ కుమార్ రెడ్డి, బత్తిన వంశీ, పెంచలగౌడ్, కోటా కృష్ణా, అనీల్, సునీల్, బాలాజీ, భాస్కర్, చందు, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

టిటిడి కళ్యాణ మండప భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వైఎస్ఆర్సిపి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు పట్టణంలో ఏప్రిల్ 27వ తేదీన జరగనున్న టిటిడి కళ్యాణ మండప భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు.మంగళవారం సత్యవేడు బేరి శెట్టి కళ్యాణమండపంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టిటిడి కళ్యాణ మండప భూమి పూజ కార్యక్రమం నిర్వహణపై ఆయన పార్టీ శ్రేణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ నిరంజన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా కార్మిక సంఘం అధ్యక్షులు బీరేంద్ర వర్మ,మండల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,బెల్ట్ రమేష్,పార్దీపన్ తదితర హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ టిటిడి కళ్యాణ మండపం నిర్మాణం పూర్తయితే పేదలు తక్కువ ఖర్చుతోనే శుభకార్యాలు చేసుకోవచ్చని అన్నారు.సత్యవేడు పట్టణంలో టిటిడి కళ్యాణమండపం నిర్మించాలన్న ఉద్దేశంతో అనేకసార్లు టిడిపి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వినతులు కూడా సమర్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.దీనిపై సానుకూలంగా టిటిడి స్పందించడంతోనే కళ్యాణ మండప నిర్మాణానికి అందరికీ అందుబాటులో ఉండే వారపు సంత స్థలాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు.అలాగే దాసు కుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం సంబంధించి అనేకసార్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన చెప్పారు.ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి తాజాగా 26 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.ఇందుకు సంబంధించి భూ సేకరణ పనులకు మార్గము సుగుమం అయ్యేలా చూడాల్సిన బాధ్యత స్థానిక నేతలపై ఉన్నట్టు ఆయన గుర్తు చేశారు.ఏప్రిల్ 27వ తేదీన జరగనున్న టిటిడి కళ్యాణమండపం భూమి పూజ కార్యక్రమానికి ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఆయన కోరారు.ప్రతి పంచాయతీ నుంచి ప్రజలు తరలివచ్చేలా నాయకులు సహకరించాలన్నారు.ఇదే తరహాలో మండల పరిషత్ కార్యాలయంలో సంఘమిత్రలతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం జన సమీకరణపై చర్చించారు.ఈ సమావేశంలో ఎంపీటీసీలు బాలయ్య,సరవన,గ్రామ సర్పంచులు బాలాజీ,మధురాజు,రూబెన్,గోవింద్ స్వామి, రవి రెడ్డి,వైఎస్ఆర్సిపి నాయకులు దయాకర్ రెడ్డి, అపరంజి రాజు,సచివాలయ మండల కన్వీనర్ సోమశేఖర్,మండల పరిషత్తు కోఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, మాజీ సర్పంచ్ గోవిందస్వామి,రాబర్ట్,గురు ప్రసాద్, శ్రీరాములు రెడ్డి,శ్రీనివాసులు రెడ్డి,ఢిల్లీ బాబు యాదవ్,వెంకటేశ్వర్లు,శ్రీధర్ రెడ్డి,రమణ,మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి,తిలక్, పలువురు వైసిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో స్వచ్ఛ సర్వేక్షన్‌లో ర్యాంక్ సాధించాలి: కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి నగర ప్రజల సహకారంతో అధికారులు, సిబ్బంది కృషితో స్వచ్ఛ సర్వేక్షన్ విషయంలో మొదటి ర్యాంక్ సాదించిన తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ ఆ ర్యాంకును నిలబెట్టుకోవడంతో బాటు మరింత మెరుగైన పని తీరును సాదించాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్ పై అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించిన కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్లో భాగంగ నగరపాలక సంస్థ ప్రజలను చైతన్యం చేయడంతో బాటు సిబ్బంది కృషితో క్లీన్ సిటీగా సిద్ధం చేయడం ద్వారా ఈ సంవత్సరం కేంద్ర నిబంధనలు చేరుకొని మొదటి ర్యాంకింగును చేరుకోవడం జరుగుతుందని కమిషనర్ విశ్వాసం వ్యక్తం చేసారు. నగరంలో శానిటేషన్ శుభ్రత కోసం 102 ఆటోలను అన్ని డివిజన్లకు కేటాయించడం జరిగిందని, శానిటేషన్ సిబ్బంది ప్రతి ఒక్క ఇంటి నుండి తడి,పొడి చెత్తను విడివిడిగా తీసుకొని తూకివాకం ప్లాంట్ కి పంపిస్తే అక్కడ వాటిని రీ సైక్లింగ్ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్య సర్కిల్స్ వద్ద ఏర్పడుతున్న ఐలాండ్స్‌ను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని, మెయిన్ డ్రైన్లలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కట్టడికి కృషి చేయాలని, మునిసిపల్ వర్కర్స్ కి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేద్దామన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి కమిషనర్ హరిత విజ్ఞప్తి చేస్తూ తిరుపతిని క్లీన్ సిటీగా వుంచుకొనేందుకు సహకరించాలని, మీ ఇండ్ల వద్దకే వస్తున్న శానిటరీ సిబ్బందికి తడి పొడి చెత్తలను విడి విడిగా అందించాలని, కాలువల్లో వ్యర్థ పదార్థాలను, ప్లాస్టిక్ బాటిల్స్ ను వేయకుండా మునిసిపల్ సిబ్బందికి అందించేలా సహకారం ఇవ్వాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ సర్వేక్షన్లో ర్యాంక్ సాదించేలా అందరం కలిసి సమన్వయంతో పని చేద్దామని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, సంజీవ్ కుమార్, గోమతి, మహేష్, నరేంద్ర, శానిటరి సూపర్ వైజర్లు చెంచెయ్య, సుమతి, శానిటరి ఇన్స్ పెక్టర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ లేని సమాజ నిర్మాణానికి కలసి కట్టుగా కృషి చేయాలి

బాలల హక్కులను బాల్యాన్ని కాపాడటం మన అందరి బాధ్యత: ఎన్సీపీ సీఆర్ సభ్యులు ఆనంద్

విశాలాంధ్ర - తిరుపతి : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలలు వీధుల వెంబడి తిండి కొరకు అడుక్కునే పరిస్థితి లేకుండా వారు బాల్యాన్ని స్వేచ్ఛగా అనుభవించే విధంగా వాతావరణం కల్పించుటకు, బాలల హక్కులను కాపాడడం కొరకు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఎల్లవేళలా ముందుంటుందని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ ఆర్జి ఆనంద్ అన్నారు.మంగళవారం మధ్యాహ్నం స్థానిక అలిపిరి పోలీస్ స్టేషన్ సమీపంలోని అంగన్వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ బాలల హక్కుల కమిషన్ సభ్యులు మాట్లాడుతూ భారత దేశంలో ముఖ్యంగా 51 నోడల్ ప్రాంతాలలో ప్రత్యేకించి పుణ్యక్షేత్రాలు గల ప్రాంతాల లో చిన్నపిల్లలు అడుక్కోవడం, బాల కార్మిక వ్యవస్థ ఉన్నట్లు ఎన్సిపిసిఆర్ సర్వే లో గుర్తించడం జరిగిందని, అందులో భాగంగా సంబంధిత పుణ్యక్షేత్రాల అధికారులతో, జిల్లా యంత్రాంగంతో సదరు అంశాలపై సమీక్ష చేసి, దిశా నిర్దేశం చేయబడుతుందని అన్నారు. అందులో భాగంగా నేటి మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుమల లో మహిళా శిశు సంక్షేమ శాఖ, టీటీడీ అధికారులతో ఈ అంశాలపై సమీక్షించి తనిఖీ చేసామని, వారు స్క్వాడ్ ఏర్పాటు చేసుకొని తిరుమలలో ఉన్న ప్రాంతాలలో తరచూ తనిఖీలు చేపట్టి బాల కార్మిక వ్యవస్థ లేకుండా, చిన్నారులు అడుక్కునే పరిస్థితులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లో చేపట్టారని ఇది మంచి విధానమని కితాబిచ్చారు. ఎన్ సి పి సి ఆర్ క్షేత్రస్థాయిలో బాల కార్మిక వ్యవస్థ, చిన్నారులు అడుక్కోవడం లాంటి సామాజిక రుగ్మతల పై తనిఖీ చేసి చర్యలు తీసుకోవడం, పర్యవేక్షించడం జరుగుతోందని, అంగన్వాడి కేంద్రాలను, చైల్డ్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేపట్టటం జరుగుతోందని అన్నారు. బాలల హక్కులను కాపాడే అన్ని రకాల కార్యక్రమాలను కమిషన్ చేపట్టి బాలలు వారి బాల్యాన్ని సంతోషంగా అనుభవించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి శివ శంకర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, సిడిపీఓ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు డెయిరీ కార్మికుల జీత బకాయిలు వెంటనే చెల్లించాలి

కార్మిక నాయకులు డిమాండ్

విశాలాంధ్ర -చిత్తూరు : చిత్తూరు డెయిరీ కార్మికుల జీత బకాయిలు వెంటనే చెల్లించాలని చిత్తూరు డెయిరీ కార్మిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చిత్తూరు ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతదేశంలోనే ప్రఖ్యాత గాంచిన చిత్తూరు డెయిరీని 2002 ఆగస్టు 31వ తేదీ కార్మికులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా మూసేసి డెయిరీ కార్మికులను రోడ్డుపాలు చేశారని అన్నారు. చిత్తూరు డెయిరీ మూతబడిన తర్వాత లిక్విడేటర్లుగా పనిచేసిన కొంతమంది అధికారులు ప్రభుత్వానికి, కోర్టుకు తప్పుడు నివేదిక ఇచ్చి కార్మికులకు న్యాయం జరగకుండా నోరు కొట్టారని ఆరోపించారు. స్వచ్ఛంద పదవి విరమణ చేయని కార్మికులకు జీతాలు ఇవ్వకుండా, వేరే డిపార్ట్మెంట్ వారు తీసుకుంటామని అంగీకరించినప్పటికీ వారిని రిలీవ్ చేయకుండా కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని చెప్పారు. 2006 సంవత్సరంలో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్తూరు డెయిరీని ప్రారంభించాలని, కార్మికులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి చైర్మన్ గా హౌస్ కమిటీ వేశారు.ఆ కమిటీ చిత్తూరు డెయిరీ గురించి అధ్యయనం చేసి చిత్తూరు డెయిరీని పునః ప్రారంభించాలని, కార్మికులకు జీతాలు ఇవ్వాలని సిఫార్సు చేశారు. కార్మికులకు న్యాయం జరుగుతుందనే తరుణంలో , వైయస్ రాజశేఖర్ రెడ్డి దురదృష్టవశాత్తు ప్రమాదంలో మరణించారు. తర్వాత ఆయన కుమారుడు ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు తన ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా జరిగిన పాదయాత్రలో చిత్తూరు డెయిరీ కార్మికులకు జీతాలు ఇప్పిస్తానని, చిత్తూరు డెయిరీని పునః ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు కార్మికులకు జీతాలు ఇవ్వాలని మద్దతు ఇస్తున్నప్పటికీ కార్మికులకు జీతాలు చెల్లించలేదు. ఇప్పటికే ఎంతోమంది కార్మికులు అనారోగ్యంతో, మరి కొంతమంది కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్య చేసుకుని కార్మికులు చనిపోయారు. ఇప్పటికీ 101 మంది కార్మికులు ఎటువంటి పరిహారం అందక వారి పరిస్థితి ఆత్మహత్యే శరణ్యంగా మారిందన్నారు. చిత్తూరు డెయిరీ స్థానంలో అమూల్ డెయిరీ ని ప్రభుత్వం ప్రారంభిస్తున్న సందర్భంగా కార్మికుల జీతాలు చెల్లించి తర్వాత అమూల్ డెయిరీని ప్రారంభించాలని హెచ్చరించారు. అధికారులు చేసిన తప్పుకు కార్మికులను బలిచేయకుండా 21 సంవత్సరాలు జీత బకాయిలు సుమారు 55 కోట్లు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో చిత్తూరు డెయిరీ కార్మిక నాయకులు జానం గంగిరెడ్డి, జి.వెంకటరమణ, పిడి కుమార్, వీ.రవి, చంద్రశేఖర్, కే.బలరాం, చిన్నస్వామి, వేలాయుధం, వాల్టర్, ధనరాజ్, రాజేంద్ర, శాంత కుమారి పాల్గొన్నారు.

ఉత్తమ బోధనే లక్ష్యంగా తనిఖీలు:ఎంఈవో

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్యా బోధనే లక్ష్యంగా పాఠశాల సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారిణి భువనేశ్వరి చెప్పారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్ పీ బీ ఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల సామాజిక తనిఖీలపై ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మెరుగైన విద్య, వివక్షత లేని పాఠశాల వాతావరణం, సామాజిక రుగ్మతల నివారణ, బాల్యవివాహాల నిర్మూలన, ఆడపిల్లల భద్రత, జవాబుదారీతనం, తల్లిదండ్రుల అభిప్రాయాల సేకరణ, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు తదితర అంశాలే లక్ష్యంగా సామాజిక తనిఖీలు నిర్వహించాలన్నారు. సామాజిక తనిఖీ కమిటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సమాజంలో ఉన్న విద్యావంతులు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. పాఠశాలల్లో సామాజిక తనిఖీ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి వారి నుంచి అభిప్రాయాలు సేకరించాలన్నారు. ఈ అభిప్రాయాల ఆధారంగా సామాజిక తనిఖీ కోసం నిర్దేశించిన యాప్ లో వివరాలను పొందుపరచాల్సిందిగా ఆమె సూచించారు. యాప్ నిర్వహణపై రీసోర్స్ పర్సన్ కస్తూరయ్య ప్రధానోపాధ్యాయులకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, చంద్రశేఖర్, గోపి, లక్ష్మన్న, పురుషోత్తం రాజు లక్ష్మయ్య, సీఆర్పీలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సీఆర్. రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించిన మంత్రి కాకాణి

విశాలాంధ్ర - గూడూరు : ప్రజా వైద్యులు డాక్టర్ సి.ఆర్.కె. రెడ్డి పార్థివ దేహాన్ని మంగళవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సందర్శించారు. మాజీ విజయా డైరీ చైర్మన్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రెడ్డి తండ్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ సీఆర్. రెడ్డి సోమవారం సాయంత్రం పరమపదించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కాకాణి మంగళవారం గూడూరుకు చేరుకుని ఆయన పార్థివదేహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి

తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్

విశాలాంధ్ర - గూడూరు : మే నెల 3వ తేదీన మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు గూడూరు పర్యటనను జయప్రదం చేయాలని తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహా యాదవ్ పార్టీ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం గూడూరు పట్టణంలోని గమళ్లపాలె టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జనరల్ బాడీ సమాశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నరసింహయాదవ్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో పార్టీ అధి నాయకత్వం ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని ఎంతో ప్రతష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని స్థానిక నాయకులను అభినందించారు. అలాగే మే నెల 3వ తేదీన చంద్రబాబు నాయుడు గూడూరు పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గూడూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండే పాటి గంగాప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు దామంచర్ల సత్య, పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే పరసారత్నం, స్థానిక నాయకులు పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంక టెశ్వర్లు రాజు, నెలబల్లి భాస్కర్ రెడ్డి, బిల్లు చెంచురామయ్య, ఇజ్రాయెల్ కుమార్, ఎండీ. అబ్దుల్ రహీం, చేవూరు సురేంద్ర, నాజర్, అల్లీ హుస్సేన్, సద్దాం హుస్సేన్, మూర్తుజ, మట్టం శ్రావణి, గుఃడాల లీలావతి, శ్రీదేవి, భారతి పాల్గొన్నారు.

తిరుమలలో జగన్ స్టిక్కర్లు అతికించి రాజకీయ క్షేత్రంగా చేశారు

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ ప్రాంతంలోని మంగళవారం ఉదయం విలేకరు సమావేశంలో చిత్తూరు పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి మాట్లాడుతూ తిరుమల తిరుపతి క్షేత్రాన్ని జగన్ మోహన్ రెడ్డి స్టిక్కర్లు అతికించి రాజకీయ క్షేత్రంగా మార్చేశారు. తిరుమలలో రాజకీయ కార్యక్రమాలు, ప్రచార కార్యక్రమాలు పూర్తిగా నిషేధించినప్పటికీ కూడా వైఎస్ఆర్సిపి నాయకులు అత్యుత్సాహంతో జగన్మోహన్ రెడ్డి స్టిక్కర్లు తిరుమలలోని బాలాజీ నగర్ లోని ప్రతి ఇంటికి అందించడం, జగనన్న నువ్వే నాకు నమ్మకం, అని నువ్వే మా భవిష్యత్తు అని ప్రచారం చేయటం తిరుమలని అపవిత్రం చేయడమే అవుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం నిఘా విభాగం పూర్తిగా మొద్దు నిద్రపోతున్నది. ఈరోజు తిరుమల కొండపైన జగన్ మోహన్ రెడ్డి స్టిక్కర్లతో ప్రచారం చేయటం చూస్తుంటే హిందూ భక్తుల మనోభావాలు పూర్తిగా గాయపడ్డాయి. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు మెగా విభాగం ముద్దు నిద్ర వీడి తిరుమల పవిత్రతను కాపాడాలని చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి డిమాండ్ చేసారు.

ఐదు శాతం రాయితీ ఇక ఐదు రోజులే: కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : ఈ ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థల పన్నుల చెల్లింపుపై 5 శాతం రాయితీకి ఇక 5 రోజులే సమయం వుందని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించడం వలన నగరాభివృద్ధికి దోహదపడుతుందని, పాత బకాయిలు వున్న పన్నులపై వడ్డీని మాఫీ చేసిన ప్రభుత్వం నేడు ఈ ఆర్థిక సంవత్సరానికి ఈ నెలఖారు లోపు ఏక మొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లింపులపై 5 శాతం రాయితీని ప్రకటించందని, ఈ అవకాశాన్ని తిరుపతి ప్రజలు సద్వినియోగం చేసుకొని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యలయంలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు తమ పన్నులను చెల్లించవచ్చని కమిషనర్ హరిత ఐఏఎస్ తెలిపారు.

రికార్డులు లేని వాహనాలకి జరిమానా

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం పుత్తూరు నారాయణ వనం బైపాస్ ప్రతి వాహనాలని క్షుణ్ణంగా పరిశీలిస్తూ రికార్డులు డ్రైవింగ్ లైసెన్స్ హెల్మెట్ ధరించకుండా వారిపై రికార్డు లేని వాహనాలకి జరిమానాలు విధిస్తూ వాహనదారులకు అవగాహన సదస్సు కల్పించారు వాహనం నడిపే సమయంలో అతివేగంగా నడపరాజు హెల్మెట్ ధరించాలి అన్ని విధాలుగా వాహనాలకు సంబంధించిన రికార్డులు ఉండాలి అదే విధంగా అతివేగం వెళ్లకూడదు తమ గమ్యం క్షేమంగా చేరాలని కొంతమంది వాహనదారులకు సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో పుత్తూరు సీఐ లక్ష్మీనారాయణ హెడ్ కానిస్టేబుల్ రవి పోలీస్ శాఖ బృందం ఇతరులు పాల్గొన్నారు

వీరభద్రుని ఆలయంలో భారీ అన్నదానం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో ఉన్న కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అన్నదాన కమిటీ కార్యదర్శి తుమ్మూరు మునిమోహన్ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వారం దాతగా మరమాల వెంకట సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి తేజోవతమ్మ దాతగా వ్యవహరించారని తెలిపారు. సుమారు 800 మంది అన్నప్రసాదాలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు.

మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ

విశాలాంధ్ర-చిల్లకూరు: మండలకేంద్రం చిల్లకూరు లో మంగళవారం చిల్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సయ్యద్ షాలోమ్ అరాఫత్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సిహెచ్వో శ్రీనివాసులు, సబ్ యూనిట్ అధికారి రామరాజు, పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆషా కార్యకర్తలు, ర్యాలీ లో పాల్గొన్నారు.

అటానమస్ దిశగా ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాల

- టీటీడీ జేఈవో సదా భార్గవి

విశాలాంధ్ర - తిరుపతి : మొదటి ప్రయత్నంలోనే న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ సాధించిన శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల అటానమస్ దిశగా అడుగులు వేయాలని టీటీడీ జేఈవో సదా భార్గవి కోరారు. తిరుపతిలోని ఎస్జీఎస్ కళాశాలకు న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ వచ్చిన సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జేఈవో మాట్లాడుతూ, టీటీడీ ఆధ్వర్యంలోని అన్ని డిగ్రీ కళాశాలలకు న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ లభించడం సంతోషకరమన్నారు. కోవిడ్ తర్వాత న్యాక్ బృందం కళాశాలను సందర్శించిందని, ఇక్కడి మౌలిక వసతులను గుర్తించి ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు అందించిందని చెప్పారు. ఇందుకు కృషి చేసిన డిఈవో , కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.కళాశాలలో ఆలయ శిల్పకళ, ఆలయ సాంప్రదాయం ఉట్టిపడేలా ఆర్ట్ గ్యాలరీ ప్రారంభించినట్టు తెలిపారు. ఆత్మీయ సమావేశంలో వాకర్స్ అసోసియేషన్, పెన్షనర్స్ అసోసియేషన్ పాల్గొని అధ్యాపకులను అభినందించడం సంతోషకరమన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులైన డెప్యూటీ ఈవో శ్రీ గోవిందరాజన్, పిఆర్వో డా. టి.రవి తదితరులు కలిసి కళాశాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఈవో డా.ఎం.భాస్కర్ రెడ్డి, ఎస్జీఎస్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డితోపాటు టీటీడీలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

విద్యా సామాగ్రి పంపిణీ అభినందనీయం

విశాలాంధ్ర - గూడూరు : అంగన్వాడీ కేంద్రాలలో విద్యనభ్యసించే చిన్నారులకు మహమ్మద్ ఫక్రుద్దీన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా సామాగ్రి పంపిణీ చేయడం అభినందనీయమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అర్బన్ సీడీపీఓ షేక్. మహబూబి అన్నారు. గూడూరు పట్టణం బనిగిసాహెబ్ పేట లోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు నోటు పుస్తకాలు, వాటర్ బాటిల్స్, పెన్సిళ్లు, షార్ప్నర్, రబ్బర్ల ను మొహమ్మద్ ఫక్రుద్దీన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఎంఎఫ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మగ్దూమ్ మొహిద్దీన్ గతంలోనూ అంగన్వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు, చిన్నారులకు విద్యా సామాగ్రి, తిను బండారాలు అందించారని గుర్తు చేశారు. తండ్రి పేరుతో సంస్థను స్థాపించి సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్న మగ్దూమ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎఫ్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మగ్దూమ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా అంగన్వాడీ టీచర్ కోరిక మేరకు చిన్నారులకు విద్యా సామాగ్రిని అందించడం, చిన్నారులతో కొంత సమయం వెచ్చించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ట్రస్ట్ గౌరవ సలహాదారులు, సామాజిక కార్యకర్త ఎండీ. అన్వర్ బాష మాట్లాడుతూ మొహమ్మద్ ఫక్రుద్దీన్ చారిటబుల్ ట్రస్ట్ చేసే ప్రతి సేవా కార్యక్రమాలను చక్కగా నిర్వహించడం స్ఫూర్తి దాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మగ్దూమ్, ఎండి. అన్వర్ బాష, ఈద్గా యూత్ యస్దాని, కరిముల్లా, సీడీపీఓలు మెహబూబ్ బి, జ్యోతి కిరణ్, సూపర్వైజర్ ఆషా బేగం, టీచర్ మోతీ జాన్, గయాజ్, జంషీద్ లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
చిత్తూరు జిల్లా

వైసిపి దుర్మార్గపు పాలనకు చమర గీతం పాడుదాం

టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర - పుంగనూరు: తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి మండల పర్యటనలో భాగంగా మూడవరోజు బోడేవారి పల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఈడిగా పల్లి గ్రామంలో మంగళవారం రోజున పర్యటించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టి అడుగడుగున ఘనంగా స్వాగతం పలకారు. గ్రామాల్లో పర్యటించేటప్పుడు రోడ్లను మురుగునీటి కాలువలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క గ్రామం కూడా అభివృద్ధి చెందిన పాపాన పోలేదన్నారు. తాను ఎక్కడికి వెళ్ళినా ఎటుచూసినా రోడ్డు గుంతల మైమై ఉన్నాయని కాలువలు అయితే ఏ ఒక్క కాలువ ఈ ప్రభుత్వంలో ఏర్పాటు చేయలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి పనులు ఏగ్రామానికి వెళ్లిన కనిపిస్తున్నాయన్నారు. నిత్యవసర సరుకులు పెంచడం వలన సామాన్యులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇలా ప్రజలపై భారం మోపుతున్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలంతా సైనికుల ముందుకు వచ్చి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండబెట్టి వైసిపి ప్రభుత్వానికి చమర గీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి కార్య నిర్వాహక కార్యదర్శి శ్రీకాంత్ రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు ఆసూరి బాలాజీ రాజంపేట పార్లమెంట్ తెలుగు యూత్ ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేష్ ,మైనార్టీ నాయకులు సయ్యద్ సుహేల్ భాష, పోలీస్ గిరి, సివిరెడ్డి, చదల్లా వెంకట రెడ్డి, మోహన్ రెడ్డి, రామయ్య, మాధవరెడ్డి, ప్రసాద్ స్వామి, చిన్న మోహన్ నాయుడు, ఐటీడీపీ కుమార్, నరసింహులు, వెంకటరమణ, గంగులప్పా, సమీపతి యాదవ్, సద్దాం, నూరుల్లా, షామీర్ భాష, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయంలో మహిళలతో మహా సంప్రోక్షణ కార్యక్రమం

పలమనేరు-విశాలాంధ్ర :పాతపేటలోని వేణుగోపాల స్వామి గుడి వద్ద నుండి మంగళవారం పలమనేరులో శ్రీశ్రీశ్రీ తిరుపతి గంగమ్మ జాతర మే నెలలో జరుగనున్న సందర్భంగా మంగళవారం అమ్మవారికి కలశములతో సంప్రదాయ బద్ధంగా వేణుగోపాల స్వామి వారి ఆలయం నుండి మహిళలతో కలిసి వచ్చి మహా సంప్రోక్షణ కార్యక్రమంలో అమ్మవారికి పసుపు నీటి అభిషేకతో పలమనేరు ఎమ్మెల్యే డాక్టర్ వెంకటే గౌడ పావని గౌడలతో కలసి మున్సిపల్ చైర్ పర్సన్ పవిత్ర మురళీకృష్ణ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పసుపు నీటిని తీసుకువచ్చి రోడ్లన్నీ పసుపు నీటితో శుభ్రం చేశారు. అనంతరం మారెమ్మ గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గంగమ్మ గుడి చైర్మన్ నరేష్, గుడి డైరెక్టర్లు ప్రజలుపాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచే కీలకం

విశాలాంధ్ర - కార్వేటినగరం : గ్రామాల అభివృద్ధికి సర్పంచ్లో కీలకమని మండల పరిషత్తు అధ్యక్షురాలు ఆర్.లతబాలాజీ అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచ్లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పంచయాతీకి ప్రథమ పౌరులు సర్పంచ్లో ఆ గ్రామ పంచాయతీ అభివృద్ధికి కీలకమని కొనియాడారు. అధికారులతో పాటు. ప్రతి ప్రతినిధులు సమిష్టిగా కృషి చేస్తూ గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించి ప్రజలకు సమ్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత కూడా సర్పంచ్లదేనని సూచించారు. డీఎం పంచాయతీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని రానున్న ఏడాదికి జిల్లా స్థాయిలో అవార్డు అందుకునేల అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని 22 పంచాయతీల సర్పంచ్లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది. పంచాయతీ కార్యదర్శులను శాలువలు కప్పి, ప్రసంశా పత్రాలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ శేఖర్రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ. మాజీ ఏఎంసీ చైర్మన్ క్రిష్ణయాదవ్. రాష్ట్ర యువత అధ్యక్షుడు ధనంజయరెడ్డి, మండల కోఆప్షన్మెంబర్ పట్నం ప్రభాకర్రెడ్డి, ఎంపీడీవో మోహనమురళీ, ఈవోపీ ఆరీ లక్ష్మీపతి, పలువురు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం

విశాలాంధ్ర-పలమనేరు : ప్రపంచ మలేరియా దినోత్సవంలో భాగంగా పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని కాకతోపు యూపీహెచ్ సి పరిధిలో రంగపురం సర్కిల్ నందు ర్యాలీ నిర్వహించి పుర వీధుల్లో మలేరియాపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని దోమ కాటుకు గురి కాకుండా దోమతెరలు వాడాలని అందుకు వేపాకు పొగ కాయిల్స్ పిల్లలకు శరీరం పూర్తిగా కప్పిన దుస్తులు వాడాలని ఇంటి చుట్టూ పక్కల మంచి నీటి కుంటలు లేకుండా ఆలాగే వాడని వస్తువులు సీసా పెంకులు టైర్ పనికిరాని వస్తువులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. మలేరియా అంతంమన లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని తెలిపారు.దీనిని సామాజిక బాద్యాతగా భావించి 2030 లోపు మలేరియా లేని బారత దేశం గా చేయాలని అందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని పుర ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, సబ్ యూనిట్ ఆఫీసర్ జయశంకర్,వైద్య సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.

మలేరియా పై అవగాహన కల్పించండి

విశాలాంధ్ర-పాలసముద్రం : మలేరియా పై అవగాహన కల్పి చాలని ఆరోగ్య కేంద్రం కమిటీ చైర్మన్ శివ ప్రకాష్ రాజు అన్నారు సోమవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై దోమల వల్ల వచ్చే అనర్థాలు రోగాల గురించి అవగాహన కల్పించాలని అదేవిధంగా గ్రామ వీధులలో దోమల మందు పిచికారి చేయాలని తాగునీటి ట్యాంకులను శుభ్రపరచుకోవాలని ఎక్కడ మురికి నీరు నిల్వ లేకుండా బ్లీచింగ్ పౌడర్ వెదజల్లాలని అప్పుడే ప్రజలను రోగాల బారి నుండి కాపాడుకోవచ్చునని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే మన అందరి బాధ్యత

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు:- మలేరియా రహిత సమాజమే మన అందరి బాధ్యతని వైద్య అధికారిణి జానకిరావు అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారిణి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా వ్యాధిని నిర్మూలించవచ్చునని అన్నారు. మలేరియా వ్యాధి లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య చికిత్స పై సమగ్రంగా వివరించారు. గ్రామాలలో దోమల మందు పిచికారి చేయాలని త్రాగునీటి ట్యాంకులు శుభ్రపరుచుకోవాలని ఎక్కడా మురికి నీరు లేకుండా బ్లీచింగ్ పిచికారి చేయాలని అన్నారు. అప్పుడే ప్రజల రోగాల బారి నుండి కాపాడుకోవచ్చని అన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని సూచించారు. దోమకాటు మనిషికి చేటు, మురికి నీటి నిల్వలు నిలయం అని నినాదం చేశారు. అనంతరం దోమల నివారణ పై పురవీధులలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, వైద్యదికారిణి కుముదవల్లి ,వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల కార్మిక చట్టాలను తప్పక అమలు చేయాలి

జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు

విశాలాంధ్ర - చిత్తూరు: బాల్య వివాహాలు అరికట్టడం, బాల కార్మిక చట్టం అమలు చేయడం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ముఖ్య ఉద్దేశ్యమని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఆర్ జి ఆనంద్ తెలిపారు. మంగళవారం చిత్తూరు లోని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నందు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో గత సంవత్సరం కమిషన్ సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్ తదితర అంశాలకు సంబంధించి సంబంధిత శాఖ అధికారుల నుండి నివేదిక ను సేకరించి కమిషన్ కు నివేదించడం జరుగుతుందని, తద్వారా కమిషన్ బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్ పై రూపొందించిన నిర్ణయాలను జిల్లా యంత్రాంగంకు అందించడం జరుగుతుందని తెలిపారు. భారత దేశం మొత్తంలో 51 ఆలయాలు, చర్చ్ లు, మసీదుల వద్ద చైల్డ్ లేబర్, చైల్డ్ బెగ్గింగ్ వంటివి పూర్తిగా నిర్మూలించడానికి కమిషన్ నిర్ణయించిందన్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన విధి విధానాలను రూపొందించడం జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన దిశా పోలీస్ స్టేషన్ ను సందర్శించడం జరుగుతుందని చెప్పారు. బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్ పై నిరంతర పర్యవేక్షణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

మామిడి రైతులకు ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తాం:ఉద్యానశాఖ కమీషనర్

విశాలాంధ్ర -చిత్తూరు : మామిడి రైతులకు ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామని, అలాగే మామిడి రైతులు పక్వానికి వచ్చిన మామిడి పంటను మాత్రమే దశల వారీగా కోయాలని, తద్వారా ఒకేసారి దిగుబడి ఎక్కువ కాకుండా రైతులకు సరియైన ధర అందేందుకు అవకాశం ఉంటుందని, ఉద్యానశాఖ కమీషనర్ ఎస్.ఎస్. శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ఉద్యాన శాఖ కమీషనర్, జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తో కలసి జిల్లాలో మామిడి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో మామిడి రైతులు, గుజ్జు యజమానులతో విడివిడిగా సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ జిల్లాలో మామిడి సీజన్ ప్రారంభమైన నేపథ్యం లో మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల యజమానులతో చర్చించి వారికి గల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే దిశగా ముందస్తుగా సమావేశం నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలో పండించే తోతాపురి రకానికి ఎక్కువ ప్రాధాన్యత కలదని, ఈ రకానికి సంబంధించిన గుజ్జుకు కూడా ఎక్కువ డిమాండ్ ఉన్నందున రైతులందరూ ఒకే సారి పక్వానికి వచ్చినా రాకపోయినా పంటను కోయడం ద్వారా అధిక దిగుబడి కారణంగా ధరలు తగ్గే ప్రమాదం ఉంటుందని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే దశల వారీగా కోయాలని, తద్వారా రైతుకు సరియైన ధర పొందేందుకు అవసరం ఉంటుందని తెలిపారు. శాఖాపరంగా రైతులకు అవసరమైన సాంకేతిక సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని, ఈ అంశానికి సంబంధించి ఇప్పటికే జిల్లాలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూన్ మొదటి వారం నుండి తోతాపురి రకం పంట కోయడం ప్రారంభం అవుతుందని, ఈ రకానికి ఎక్కువ గిరాకీ ఉన్నందున జిల్లాలో ఎక్కువ భాగం మామిడి పంట పై రైతులు ఆసక్తి చూపారని, రైతులకు సరైన ధర వచ్చేందుకు రైతులు కూడా అధికారుల సూచనలను, సలహాలను పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సీజన్ లో ఎటువంటి సహాయ సహకారాలు అయినా అందించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా కలదని తెలిపారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,08,428 హెక్టార్లలో 5,86,563 మెట్రిక్ టన్నుల మామిడి పంట దిగుబడి అవుతుందని, ఇందులో తోతాపురి, నీలం, ఖాదర్, బెనిషా, సిందూర, లాల్ బాగ్ రకాలను పండించడం జరుగుతున్నదని, ఒక ఎకరా సాగుకు దాదాపు రూ. 30 వేలు ఖర్చు అవుతుందని, 31 గుజ్జు పరిశ్రమలు కలవని, 3,64,640 మెట్రిక్ టన్నుల ప్రాసెసింగ్ కెపాసిటీ అని, మామిడి పంటకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించే విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని హార్టి కల్చర్ డి డి మధుసూదన్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ పంటకు గిట్టుబాటు ధరను కల్పించాలని, ధర నిలకడగా ఉండేలా ధరల నిర్ణయ కమిటీని ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని, ధరల వివరాలను ప్రదర్శించాలని, మామిడి పంటకు ఇన్సూరెన్స్ అందేలా చూడాలని రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని, టిటిడి వారు మామిడి జ్యూస్ ను కొనుగోలు చేసేలా, ఉపాధి హామీ పనులకు ఈ పంట సాగును అనుసంధానం చేయాలని, అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన మెళకువలు సంబంధించి రైతులకు అవగాహన సదస్సులను విరివిగా నిర్వహించాలని, గుజ్జు పరిశ్రమల యజమానులు పంట కొనుగోలు కు సంబంధించిన బకాయిలు త్వరగా రైతులకు ఇవ్వాలని మామిడి రైతులు జయచంద్ర చౌదరి, గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నాగేశ్వర రాజు, జగదీశ్ రెడ్డి, వేణు, వాసు, భాస్కర్, తదితరులు కోరారు. జిల్లాలో గుజ్జు పరిశ్రమలకు అవసరమైన మామిడి పండ్లను క్రషింగ్ మొదటి దశలో కృష్ణా జిల్లా నుండి దిగుబడి చేసుకోవడం జరుగుతుందని, జిల్లాలో సీజన్ మొదలైన వెంటనే జిల్లాలో పండే మామిడి పంటను మాత్రమే క్రషింగ్ చేయడం జరుగుతుందని, జిల్లాలో మామిడి పంటకు డిమాండ్ లేని సందర్భంలో కూడా రైతులకు గుజ్జు పరిశ్రమల వారు మంచి ధరను ఇవ్వడం జరిగిందని, రైతులు నష్టపోకుండా పంటను ఇతర రాష్ట్రాలకు పంపకుండా, ఆర్థిక భారాన్ని భరించి కొనుగోలు చేయడం జరిగిందని, ర్యాంప్ లు నిర్వహణలో లోటు పాట్లను కొలతలు, తూనీకల శాఖ అధికారులను సమన్వయము చేసుకుని సరిద్దిద్దాలని, గుజ్జును ఎగుమతి చేసేందుకు ఉన్న సమస్యలను పరిష్కరించాలని గుజ్జు పరిశ్రమల యజమానులు గోవర్ధన్ బాబీ, బాబు రెడ్డి, చంద్రశేఖర్, అమరనాథ్, శివకుమార్, బషీర్, సమీర్ శర్మ, తదితరులు కోరారు ఈ సమావేశం లో తిరుపతి, అన్నమయ్య ఉద్యాన శాఖాధికారులు దశరథ రామిరెడ్డి, రవిచంద్ర బాబులు, హార్టి కల్చర్ ఏ డి కోటేశ్వర రావు, హార్టి కల్చర్ శాఖ అధికారులు, రైతులు, గుజ్జు పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్మోహన్ రెడ్డే ముఖ్యమంత్రి: ఎమ్మెల్యే వెంకటేగౌడ

విశాలాంధ్ర - వి. కోట : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా మళ్లీ జగన్మోహన్ రెడ్డే ముఖ్యమంత్రి అని స్థానిక శాసనసభ్యులు ఎన్. వెంకటేగౌడ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముదందొడ్డి పంచాయతీ లోని ఎగువ నడిపే పల్లి, దిగువ నడిపేపల్లి, చిన్నాగనపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంబంధిత సచివాలయం పరిధిలోని 788 గృహాలు వద్దకు వెళ్లి గత నాలుగేళ్లుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నవరత్నాలలో అర్హులైన ప్రతి లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల వివరాలను బ్రోచర్ ద్వారా వివరించారు. అనంతరం సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందడంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరగా లబ్ధిదారులు సంతృప్తి గా ఉన్నట్లు సమాధానం రావడంతో ఇవే పథకాలు ప్రతి పేద వారికి, ప్రతి విద్యార్థికి, ప్రతి రైతుకు, ప్రతి మహిళకు అందుతూ ఉండాలంటే రాబోయే ఎన్నికల్లో శాసనసభ్యుడు గా తనను మరో మారు మీ ఓట్లు ద్వారా ఆశీస్సులు అందించాలని కోరారు. రాష్ట్రంలో మరో సారి జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి గా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి యువరాజ్, వైస్ ఎంపిపి లక్ష్మణ్ రెడ్డి, సర్పంచ్ దామోదర్, ఉపసర్పంచ్ ప్రభాకర్, పంచాయతీ కన్వీనర్ రాధాకృష్ణ, ఎంపిటిసి అతావుల్లా, పిఎసిఎస్ చైర్మన్ గోపిరెడ్డి, డైరెక్టర్ షేక్ ఆదం సేట్, రెస్కో డైరెక్టర్ భూపతి, నాయకులు హరికృష్ణ, ఇతర పంచాయతీ ల సర్పంచులు సుభాష్, జయప్ప గౌడు, రామచంద్రప్ప, ఎంపీటీసీలు మురుగేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం పేదప్రజల కడుపునింపేందుకే రాజన్న క్యాంటీన్

- ఎమ్మెల్సీ భరత్

విశాలాంధ్ర - కుప్పం : కుప్పం లో రాజన్న క్యాంటీన్ ను ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. కుప్పం లో పలువురు పేదలు ఆకలి తో స్వతహాగా కడుపు నింపు కోలేని వారికి ఆసరాగా నిలిచేందుకు రాజన్న క్యాంటీన్ ను ఏర్పాటు చేసి పేదప్రజల కడుపునింపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని కుప్పం టౌన్లోని ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదుట, పూల మార్కెట్ వద్ద రెండు చోట్లా ఎంపిక చేశారు. ఆ స్థలాలని పరిశీలించిన వారిలో ఎమ్మెల్సీ భరత్ తోపాటు మున్సిపల్ చైర్మన్ డాక్టర్. సుధీర్, వైస్ చైర్మన్ మునస్వామి, ఏ.ఎం.సి చైర్మన్ విద్యా సాగర్. టౌన్ బ్యాంక్ చైర్మన్ బాగ్యరాజ్, నేతలు అవినాశ్, ధర్మ వున్నారు. రాజన్న క్యాంటీన్ ను కుప్పం లో 27 వ తేదీన మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు.

రాజ్ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్స్ ముగింపు

విశాలాంధ్ర - కార్వేటినగరం : రాష్ట్రీయ సేవా సమితి రాజ్ మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న బ్యూటీషియన్ కోర్సును కార్వేటి నగరంలోని బౌండ్ వీధి నందు గత 84 రోజులుగా రోజుకు రెండు గంటల పాటు ఉచితంగా శిక్షణ. నిర్వహించారు అందులో భాగంగా మంగళవారం ముగింపు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 20 మంది మహిళలకు మెహందీ, హెన్నా, ఫేషియల్, హెయిర్ కటింగ్, మోడల్ ఐబ్రోస్, బ్యూటిషన్ నిర్వహించారు. ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించడం జరిగింది. కెఎస్ఎస్ ద్వారా శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. రాజ్ ప్రాజెక్టు అధికారి రాష్ట్ర మహిళా సంఘాల ద్వారా ఆర్థిక లావాదేవీలతో వృత్తి శిక్షణ ఆరోగ్యం, విద్య ఉపాధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికారులు అన్సర్ గన్, ధనలక్ష్మి, ప్రకాష్, బ్యూటీషియన్ చందన నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ సర్పంచ్ గా ఏకాంబరం

విశాలాంధ్ర - గంగాధరనెల్లూరు : మండలంలోని పెద్దకాల్వ సర్పంచ్ ఏకాంబరం జిల్లా ఉత్తమ సర్పంచిగా ఎంపిక య్యారు. జాతీయ పంచాయతీ రాజ్ వేడుకల కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రం చిత్తూరులో కలెక్టర్ షన్మోహన్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఏకాంబరం జిల్లా ఉత్తమ సర్పంచ్ గా ప్రశంసా పత్రం, మెమొంటోలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీదేవి , ఈఓపిఆర్డి శివయ్య ఉత్తమ సర్పంచ్ ఏకాంబరంకు ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు.

ఉపాధ్యాయునికి సోకజ్ నోటీస్

విశాలాంధ్ర-పెద్దపంజాణి: పెద్దపంజాణి మండలం చలమంగళం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఎం వెంకటరమణకు పెద్దపంజాణి మండల విద్యాశాఖ అధికారిని హేమలత షోకాస్ నోటీసును ఇచ్చారు.దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి ప్రస్తుతం చలమంగళం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎం వెంకటరమణ గతంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పెద్దకాపల్లి నందు ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు అప్పటి నాడు నేడు మొదటి విడత కార్యకలాపాలను పెద్దకాపల్లె పాఠశాల నందు వెంకటరమణ అయితే 2020 సాధారణ బదిలీలలో వెంకటరమణ పెద్ద కాపల్లి పాఠశాల నుంచి చలమంగళం పాఠశాలకు బదిలీ వెళ్లారు అయితే అప్పటినుంచి ఇప్పటివరకు పెద్ద కాపల్లికి సంబంధించిన నాడు నేడు మొదటి విడత రికార్డులను సక్రమంగా నిర్వహించలేదని వాటికి సంబంధించిన రిజిస్టర్లను ప్రస్తుత ప్రధానోపాధ్యాయులకు అప్పచెప్పలేదని దానికి సంబంధించిన వివరాలను మూడు రోజుల్లోపు లిఖితపూర్వకంగా అందించాలని లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తెలిపారు

మలేరియా నివారణ పై అవగాహన సదస్సు



విశాలాంధ్ర - బైరెడ్డిపల్లె : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా రహిత సమాజమే మన ధ్యేయమని నానుడి తో కార్యక్రమం మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో జరిగింది. వైద్యాధికారి డాక్టర్ విజయ్ చంద్ర మాట్లాడుతూ ఆడ అనాఫిలస్ దోమ వలన మలేరియా జ్వరము వచ్చునని దోమ కాటు ప్రమాదకరమని ప్రాణాంతకమని దోమ కాటు వలన మలేరియా డెంగ్యూ చికున్ గున్యా బోదకాలు మెదడువాపు మొదలగు వ్యాధులు వచ్చినని తెలిపారు సావిత్రి హెల్త్ ఎడ్యుకేటర్ అవగాహన కల్పిస్తూ మలేరియా వ్యాధి నియంత్రణకు దోమతెరలు వాడాలి నేటి నిలువ లేకుండా జాగ్రత్త వహించాలి నీటి తొట్టెలు కుండలు పై మూతలు ఉండాలి ఫ్రైడే డ్రై డే పాటించాలి వారమునకు ఒకసారి ఖాళీ చేసి కడిగి ఆరబెట్టి నింపుకోవాలి తద్వారా దోమ గుడ్లు పిల్లలను నిర్మూలించవచ్చు పరిసరములు పరిశుభ్రంగా పెట్టుకోవాలి ఇంటి ఆవరణంలో పనికిరాని వస్తువులు పిచ్చి మొక్కలు తొలగించాలి దోమ కాటేయకుండా ఉండడానికి దోమతెరలు వాడాలి శరీరము పూర్తిగా కప్పిన దుస్తులను ధరించాలి కిటికీలు తలుపులకు మెష్ పెట్టుకోవాలి చిన్నపిల్లలు వృద్ధులు గర్భవతులు దీర్ఘకాలిక వ్యాధులు రక్తహీనత మొదలగు వారికి ముప్పు ఎక్కువ కావున జాగ్రత్తగా ఉండాలి జ్వరము ఉన్నప్పుడు రక్త పరీక్షలు చేసుకుని చికిత్స చేసుకోవాలి మన ఆరోగ్యం మన చేతుల్లోనే కావున పరిసరాల పరిశుభ్రతని ప్రతి ఒక్కరూ సమాజ బాధ్యతగా భావించి ప్రజారోగ్యాన్ని కాపాడాలి మలేరియా ని అంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు

విధులకు పెన్ డౌన్ ప్రకటించిన ద్రావిడ వర్సిటీ నాన్ టీచింగ్ సిబ్బంది

విశాలాంధ్ర - కుప్పం : గత మూడు మాసాలుగా, మాకు జీతాలు అందడం లేదు అని పలుమార్లు మీ దృష్టికి తీసుకు వచ్చామని ఇంతవరకు మాకు న్యాయం జరగలేదని ఇక చేసేది ఏమి లేక మేము తప్పనిసరై నిరవధిక సమ్మెకు పిలుపునిస్తున్నాము అని విశ్వవిద్యాలయం రిజిస్టార్ వేణుగోపాల్ రెడ్డికి వినతి పత్రాన్ని నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ తరుపున ఇచ్చినట్లు నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యాచరణలో, మొదటి రెండు రోజులు అనగా 26, 27తేదిలలో, ఉదయం 10 నుండి 11 వరకు మరియు మధ్యాహ్నం. 04 నుండి 05 వరకు మా విధులకు పెన్ డౌన్ ప్రకటిస్తూన్నాము అన్నారు. తదుపరి 28 నుండి నిరవధిక సమ్మెకు పిలుపునిస్తున్నాము అన్నారు.న్యాయమైన కోర్కెలకు, స్పష్టమైన, లిఖితపూర్వక హామీ లభించేవరకు ఈ సమ్మెను ఆపబోమన్నారు. పెండింగ్ లో ఉన్న అరియర్స్ ను వెంటనే మంజూరు చేయాలి అని, ఉద్యోగులందరికి సిఎఫ్ఎమ్మెస్ ద్వారా జీతాలు ఇవ్వాలన్నారు.

స్కేటింగ్‌లో ఒలంపిక్స్‌కి వెళ్లాలని ఆశ

విశాలాంధ్ర - చౌడేపల్లి: మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ సిజిఎఫ్ కాలనీలో కాపురం ముందు ఐరాల నారాయణ కుమారుడు మోహనకృష్ణ 25 సంవత్సరాలు జెసిబి డ్రైవర్ గా పని చేసేవాడు తర్వాత రాజకీయ నాయకులకు డ్రైవర్గా కొద్ది రోజులు పని చేసినాడు మోహన్ కృష్ణ స్కేటింగ్ అంటే ఉత్సాహంగా ఉండేవాడు. గత సంవత్సర రోజులుగా స్కేటింగ్ కావలసిన పరికరాలను చక్రాలను కాళ్లకు వేసుకుని సిజెపిఎస్ కాలనీ నుండి దుర్గ సముద్రం దాదేపల్లి రాజులూరు ఏ కొత్తకోట వరకు రోజుకు పది కిలోమీటర్ల స్కేటింగ్ చేస్తున్నాడు . చౌడేపల్లి పలమనేరు రహదారిలో నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రోడ్ ప్రమాదం అని తెలిసిన కానీ ప్రతిరోజు చేయడం అంటే కూడా కష్టంతో కూడిన పని అయినా కానీ అతను పట్టుదలతో ఇంకా ఇద్దరు పిల్లలకు కూడా నేర్పిస్తున్నాడు. స్కేటింగ్ చేయడం అంటే కష్టంతో కూడిన పని అయినా కానీ చాకచక్యంగా వాహనాలు తప్పించుకుంటూ స్కేటింగ్ ప్రతిరోజు నిర్వహిస్తున్నాడు. సంబంధిత అధికారులు గుర్తించి క్రీడలలో ఇతనికి శిక్షణ ఇస్తే ఒలంపిక్స్ కు వెళ్లే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు చుట్టుపక్కల వారు అంటున్నారు.

టిటిడికి టమాటాలు వితరణ

విశాలాంధ్ర- పలమనేరు :తమిళనాడు రాష్ట్రం హొసూరు పట్టణం నుండి తిరుమల తిరుపతి దేవస్థానం అన్నదానమునకు 700 బాక్సుల టమాటాలను పలమనేరు పట్టణం శ్రీవారి సేవకుడు కాపుపల్లి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో హొసూరు పట్టణానికి చెందిన గోపాల్ రెడ్డి శ్రీకాంత్ సహకారంతో తిరుమలకు దేవస్థానం వారి వాహనంలో టమోటాలను తరలించారు.ఈ కార్యక్రమంలో పలమనేరు పట్టణానికి చెందిన బాబు,సోమశేఖర్ నాయుడు, స్వామివారి వాహనంలో టమాటాలను నింపి సేవ చేసి సహకారం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులను అలరించిన రాయబారం

విశాలాంధ్ర - పాలసముద్రం : మండలంలోని ఆముదాల గ్రామంలో వెలసిన ద్రౌపతి అమ్మవారి ఆలయంలో జరుగు తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం నాడు పాండవులకు కౌరవులకు సంధి కోసం శ్రీకృష్ణ పరమాత్మ కౌరవసభలో కౌరవ పెద్దలతో సంధి కోసం చేసిన ప్రయత్నాన్ని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆర్టిస్ట్ గాన ప్రవీణ భగవతారిని ఏ శారద ఎంతో చక్కగా హరికథ రూపంలో భక్తులకు వివరించారు భక్తులు కూడా ఎంతో సావధానంతో హరికథ గానాన్ని విని ఆస్వాదించారు ఆలయ ప్రాంగ ణాన్ని విద్యుత్ దీపాలతో ఎంతో సుందరంగా అలంకరించారు తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో కూలీలందరికీ పని కల్పిస్తాం:ఎంపిపి

విశాలాంధ్ర- పులిచెర్ల- కల్లూరు:- ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉన్న కూలీలందరికీ పని కల్పిస్తామని ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. పులిచెర్ల మండలం రాజుల పల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీపీ పరిశీలించారు .ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో విరివిగా పనులు మంజూరు చేస్తున్నామని కూలీలు పనులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉపాదా హామీ పథకంలో చెరువుల అభివృద్ధి, సప్లై ఛానల్ పనులు, పొలం చుట్టు కందకాలు ఫారం ఫండ్ పనులను రైతులు కూలీలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పని వద్ద మౌలిక వసతులు త్రాగునీరు నీడ సౌకర్యం కల్పించా లన్నారు.అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుగుణమ్మ, సర్పంచ్ కృష్ణయ్య, ఏపీఓ షౌకత్ అలీ, జె ఈ కృష్ణయ్య, టి ఏ లు, ఎఫ్ఏలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక అభిషేకాలు

విశాలాంధ్ర - కార్వేటి నగరం : కార్వేటినగరంలోనే గ్రామ దేవత మంగళవారం ఉదయంప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వివిధ రకాలైన పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కే ప్రసాద్, ఉపాధ్యక్షులు రంగ నాద మొదలి, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రముక్ కన్వీనర్‌గా ఉమా మహేష్

విశాలాంధ్ర -పలమనేరు: పలమనేరు పట్టణానికి చెందినస్వాలంబిన భారత్ అభియాన్ చిత్తూరు జిల్లా కమిటీ (ఎస్ బి ఏ)లో చిత్తూరు జిల్లా కేంద్ర ప్రముక్ (కన్వీనర్) గాయు ఎస్,ఉమామహేష్, సంరక్షణగా బి ఏం లక్ష్మీనారాయణ లను ఎన్నికైనారు.కేంద్ర ప్రముక్ (కన్వీనర్) గా యు ఎస్ ఉమామహేష్ పై నా మీద నమ్మకంతో నాకు ఈ అవకాశం ఇచ్చిన ఎస్ బి ఏ విభాగ్ ప్రముక్ డాక్టర్ ఎం,సోమశేఖర్‌కు ఎస్ బి ఏ రాష్ట్ర ప్రముక్ అంజనీ శ్రీనివాస్‌కునాహృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు ఈ పదవి రావడంపై స్నేహితులు శ్రేయోభిలాషులు మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

మలేరియా పట్ల అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - రామకుప్పం: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యాధికారుల ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని విజలాపురం వీర్ణమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి దోమల నివారణకు చర్యలు తీసుకుని మలేరియా వ్యాధిని అరికట్టేందుకు తమ వంతు కృషి చేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర తిరుపతి జిల్లా

ఆరోగ్యశ్రీ కార్డు నందు మార్పులు, చేర్పులకు అవకాశం: కలెక్టర్

విశాలాంధ్ర- తిరుపతి : పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ఆరోగ్య శ్రీ పథకం పేదలకు వరంగా, వారి ఆరోగ్యానికి భరోసా కల్పించే విధంగా ఆరోగ్యశ్రీ నెట్వర్క్ హాస్పిటల్ లో చికిత్స అందించడం ద్వారా పేదవారికి కూడా మెరుగైన అధునాతనమైన వైద్య సదుపాయాలు ఆరోగ్యశ్రీ ద్వారా అందుబాటులోకి తేవడం జరిగిందని, ఆరోగ్యశ్రీ కార్డులో మార్పులు చేర్పులు చేసుకునేందుకు ప్రజలు తమ దగ్గరలోని గ్రామ వార్డు సచివాలయాలను సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఆరోగ్య శ్రీ పథకానికి అర్హులైన లబ్ధిదారులు ఆరోగ్యశ్రీ కార్డులో మార్పులు చేర్పులు చేసుకొనుటకు క్రింద తెలపబడిన సేవల కొరకు వారి దగ్గరలోని గ్రామ,వార్డు సచివాలయాన్ని నిర్దిత ధృవపత్రాలతో సందర్శించి నిర్దేశించిన రుసుము చెల్లించి మార్పులు చేసిన ఆరోగ్య శ్రీ కార్డును పొందవలెనని అన్నారు.ఆరోగ్యశ్రీ కార్డు నందు పేర్లు / వివరములు సవరణ చేసుకొనవచ్చును. ఆరోగ్య శ్రీ కార్డు పోయిన యెడల, నూతన కార్డు పొందవచ్చును. ఆరోగ్య శ్రీ కార్డు నందు మిగిలిపోయిన అర్హత గల కుటుంబ సభ్యులను చేర్చుకోవచ్చును. ఆరోగ్య శ్రీ కార్డు నందు కుటుంబ యజమాని ఫోటో మాత్రమే ముద్రించి యున్న వాటి స్థానంలో ఇప్పుడు కుటుంబసభ్యులు అందరి ఫోటో (గ్రూప్ ఫోటో ను) ఆరోగ్యశ్రీ కార్డుపై పొందుపరచవచ్చునని తెలిపారు. ప్రజలందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు.

పీవీఆర్ గ్రూప్స్ చే రూ.8 లక్షలు పన్ను చెల్లింపు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి ముందస్తుగా పీవీఆర్ గ్రూప్స్ చే మంగళవారం రు.8,09,207 లు పురపాలక అధికారులకు చెల్లించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా 5 శాతం పన్ను మినహాయింపుతో పీవీఆర్ అన్నీ సంస్థలకు కలిపి ఈ మొత్తాన్ని చెల్లించినట్లు ఆ సంస్థ డైరెక్టర్స్ పి.వి.శివశంకర్ రావు, సంతోష్ ఎం.పవార్, మేనేజర్ పి.మహేశ్వర్ రావు తెలిపారు. కమిషనర్ బాలాజీ నాయక్ ఆదేశాలు మేరకు ఆర్.ఓ నారాయణ రెడ్డి, ఆర్. ఐ. రవికాంత్ సూచనలతో ముందస్తు పన్ను వాసులు చేస్తున్నట్లు బిల్ కలెక్టర్ హరి తెలిపారు.

జగనన్న పాలనలోనే విద్యార్థులు, యువతకు ఉన్నత భవిష్యత్తు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : జగన్మోహన్ రెడ్డి పాలనలోనే విద్యార్థులు, యువతకు ఉన్నత భవిష్యత్తు ఉందని వైయస్సార్ విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి ఓబుళ రెడ్డి, రీజనల్ కో-ఆర్డినేటర్ లెక్కల రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎస్ వి యూనివర్సిటీ లోని పలు విభాగాల్లో విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. గతంలో రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి,సంక్షేమాన్ని సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారని అన్నారు.అన్ని కులాలు,మతాలు, ప్రాంతాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు.దీని ద్వారా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని విద్యార్థులు,యువత మహిళలు, రైతులు ప్రజలందరి సహాయ సహకారాలు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అవసరమని అన్నారు.వచ్చే ఎన్నికల్లో మళ్ళీ వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఓటేసి గెలిపించవలసిన బాధ్యత విద్యార్థులు,యువత పై ఉందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి నాయకులు మణి, ప్రశాంత్, ప్రదీప్, నర్సింహులు, దినేష్, భాషా, రామలింగ రెడ్డి, శ్రీనివాసులు, ప్రకాష్, ప్రేమ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మస్తాన్ యాదవ్

విశాలాంధ్ర - వెంకటగిరి : వెంకటగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం, వెంకటగిరి కళ్యాణ మండపం నందు నిర్వహించారు. ఈ సమావేశం నందు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, నారా చంద్రబాబు నాయుడు రెండవ తేదీ వెంకటగిరి కి విచ్చేయుచున్న సందర్భంగా. రూట్ మ్యాప్, మరియు సభ ప్రాంగణము,రోడ్ షో, తదితర అంశాలపై చర్చించారు.ప్రతి ఒక్క కార్యకర్త ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా కృషి చేయాలని తెలియజేసిన డాక్టర్ మస్తాన్ యాదవ్ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ నియోజకవర్గ పరిశీలకులు పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి ,మాజీ సీఎం ప్రోగ్రాం అబ్జర్వర్,దామంచర్ల సత్య,నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ,వెంకటగిరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ కన్నబాబు నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులు, మరియు పట్టణ అధ్యక్షులుమాజీ ఎంపీపీలు, సర్పంచులు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కన్వీనర్లు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణ పద్ధతులపై విద్యార్థినులకు అవగాహన

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : మలేరియా నియంత్రణ పద్ధతులపై ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపాల్ అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమానికి మంగళవారం మైక్రో బయాలజీ అధ్యాపకులు సి. సుబ్రమణ్యం రెడ్డి ఆధ్వర్యంలో, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజశఖర్ అధ్యక్షత వహించారు. ఇందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని గురించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశఖర్ మాట్లాడుతూ మలేరియా ఎలా వ్యాపిస్తుందో వివరిస్తూ సాధారణంగా, అంటువ్యాధి కలిగిన ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా ప్రజలు మలేరియా బారిన పడతారని తెలిపారు. అనాఫిలిస్ దోమలు మాత్రమే మలేరియాను వ్యాపింపజేయగలవని, అవి సోకిన వ్యక్తి నుండి గతంలో తీసుకున్న రక్తపు భోజనం ద్వారా తప్పనిసరిగా సోకినవి, ఒక దోమ సోకిన వ్యక్తిని కుట్టినప్పుడు, కొద్ది మొత్తంలో రక్తం తీసుకోబడుతుందని, ఇందులో మైక్రోస్కోపిక్ మలేరియా పరాన్నజీవులు ఉంటాయని చెప్పారు. సుమారు 1 వారం తర్వాత, దోమ తన తదుపరి రక్తపు భోజనాన్ని తీసుకున్నప్పుడు, ఈ పరాన్నజీవులు దోమ లాలాజలంతో మిళితం అవుతాయి, కాటుకు గురైన వ్యక్తికి ఇంజెక్ట్ చేయబడతాయన్నారు. మలేరియా పరాన్నజీవి సోకిన వ్యక్తి యొక్క ఎర్ర రక్త కణాలలో కనుగొనబడినందున, మలేరియా రక్తమార్పిడి, అవయవ మార్పిడి లేదా రక్తంతో కలుషితమైన సూదులు లేదా సిరంజిలను పంచుకోవడం ద్వారా కూడా వ్యాపిస్తుందని, మలేరియా ప్రసవానికి ముందు లేదా ప్రసవ సమయంలో ("పుట్టుకతో వచ్చిన" మలేరియా) తల్లి నుండి ఆమె పుట్టబోయే బిడ్డకు కూడా వ్యాపిస్తుందన్నారు. మైక్రో బయాలజీ అధ్యాపకులు సి. సుబ్రమణ్యం రెడ్డి దోమల నియంత్రణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇతర అధ్యాపకులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీరాములు, వాణి పాల్గొన్నారు.

శ్రీ ప్రసన్న వరదరాజుల స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు

పనులను పరిశీలించిన ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానమునకు అనుబంధ ఆలయమైన శ్రీ ప్రసన్న వరదరాజుల స్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల భూమిపూజ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానమునకు అనుబంధ ఆలయమైన శ్రీ ప్రసన్న వరదరాజుల స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఈనెల 27న భూమి పూజ కార్యక్రమంకు చేస్తున్న ఏర్పాట్లను అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలన చేశారు. శ్రీకాళహస్తి పట్టణ నడి బొడ్డున వెలసి ఉన్న పురాతన వైష్ణవ ఆలయం శ్రీ ప్రసన్న వరదరాజుల స్వామి ఆలయాన్ని ఈనెల 27వ తేదీన భూమి పూజ కార్యక్రమం నిర్వహించి పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రసన్న వరదరాజు స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ నిర్మాణానికి చేస్తున్న ఏర్పాట్లు ను శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి పరిశీలన చేశారు. గతంలో ఆలయం ఉన్న ప్రాంతం ఎంత, ప్రస్తుతం ఎంత మేరకు ఆలయాన్ని నిర్మాణం చేయనున్నారు. ఆలయ నిర్మాణంలో ఎలాంటి రాళ్లు వినియోగిస్తున్నారు, తదితర అంశాలన్నిటి పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ మురళీధర్ రెడ్డి, డిఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ కిషోర్ కుమార్, సూపరింటెండెంట్ శ్రీహరి, వర్క్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, స్థపతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలి

తిరుపతి కలెక్టరేట్ వద్ద జేపీసీ ధర్నా

విశాలాంధ్ర -తిరుపతి : రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో, వివిధ సంస్థల్లో ఏన్నో ఏళ్లుగా చాలీ, చాలని జీతాలతో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని కోరుతూ.మంగళవారం నాడు తిరుపతి కలెక్టరేట్.ముందు ఏపీ అమరావతి జేఏసీ, ఏపీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీల ఆధ్వర్యంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు.గత పి. ఆర్. సి. సమయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు.. నామ మాత్రంగా జీతాలు పెంచారాని, సిఎం. జగన్ మోహన్ రెడ్డి ప్రతి పక్ష నేతగా వున్నప్పుడు, పాదయాత్ర సమయంలో, తమ ఎన్నికల మాని ఫెస్టోలోఔట్ సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తానని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి నాలుగు ఏళ్ళు పూర్తి ఐనా ఇప్పటి వరకు హామీలు నెరవేర్చలేదని పలువురు జేఏసీ నాయకులు.. ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమం కు కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించి, సి. ఎం. తమ ఎన్నికల...మానిఫెస్టోలో ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం హామీని అమలు చేసి చిరుద్యోగులకు ఆదుకోవాలని కార్మిక సంఘ నేతలు కోరారు.అలాగే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏపీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పి. శ్రీకాంత్, రాష్ట్ర నాయకురాలు పి. పద్మజ రెడ్డి, తిరుపతి అమరావతి జేఏసీ అధ్యక్షులు పి.గోపినాథ్ రెడ్డి, కార్యదర్శి టి.సత్యనారాయణ, సీఐటీయూ నేత కందారపు మురళి, ఏఐటీయూసీ నేత రాధకృష్ణ, టీచర్ల సంఘాల నేత గోపాల్ రెడ్డి, వివిధ సంఘాల జేఏసీ నాయకులు, ప్రభుత్వ శాఖల అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో కిలివేటి సంజీవయ్య

విశాలాంధ్ర - నాయుడుపేట : జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా సూపర్ హిట్ అయిందని సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. మంగళవారం నాయుడుపేట రహదారులు మరియు భవనాల అతిధిగృహం నందు జగనన్న భవిష్యత్తు కార్యక్రమం సక్సెస్ మీట్ నియోజకవర్గం స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సంజీవయ్య మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి 65లక్షల గృహాలను లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు నిర్వహించామని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 20వ తారీకు వరకు కోటి గృహాలను తాము సందర్శించామని, అందులో 80 శాతం ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గం పరిధిలో 65 వేల గృహాలు ఉండగా 60 వేల మంది గృహస్తులు ప్రభుత్వంపై తమ సంతృప్తిని వ్యక్తంచేస్తూ మిస్డ్ కాల్ ద్వారా ప్రభుత్వ పనితీరుపై తమ ఆమోదముద్ర వేశారని ఆయన తెలిపారు. ప్రతి గడప వద్దకు తమ శాసనసభ్యులు ధైర్యంగా వెళ్లి, మీకు నవరత్నాలు అందుతున్నాయా లేదా అని వారి వద్ద నుంచి నేరుగా ఫీడ్బ్యాక్ తీసుకుంటున్నామని తెలిపారు. 2014 నుంచి 2019 వ సంవత్సరం వరకు పరిపాలన వెలగబెట్టిన తెలుగుదేశం పాలకులు, ఇదే విధంగా తమ హయాంలో సంక్షేమ ఫలాలు నేరుగా తమకే అందాయా అన్నవిషయాన్ని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజా రెడ్డి, ఎన్డిసిసి బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారా యణరెడ్డి, నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, నియోజకవర్గ పరిధిలో మండలఅధ్యక్షులు, జడ్పిటిసి మెంబర్లు, గృహసారధులు,పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరైనారు.

సమస్యల పరిష్కారం కోసం ప్రతి మంగళవారం డయల్ యువర్ ఆర్డీఓ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు ఆర్డీఓ ఎం. కిరణ్ కుమార్ నూతన ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన స్పందనను స్ఫూర్తిగా తీసుకుని వాట్సప్ లో వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించే అద్భుతమైన అవకాశాన్ని బాధితులకు కల్పించారు. మంగళవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వాట్సాప్ లో అర్జీలు పంపించేందుకు నూతన మొబైల్, డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించేందుకు ఆదేశించిన స్పందన కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని వాట్సప్ అర్జీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డివిజన్ కేంద్రానికి దూరంగా ఉంటూ తమ సమస్యలు తెలుపుకునేందుకు రాలేని బాధితుల కోసం వాట్సాప్ అర్జీ ఉపయోగపడుతుందన్నారు. 9490947555 నెంబర్ వాట్సాప్ లో అర్జీలు సమర్పించవచ్చున్నారు. పై నెంబర్ కు వచ్చిన అర్జీలను వెంటనే సంబంధిత తహశీల్దార్లకు బదిలీ చేసి సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్జీలు పంపిన బాధితుల మొబైల్ ఫోన్ కు సమస్యను రిజిస్టర్ చేసిన స్లిప్ కూడా పంపిస్తామన్నారు. రెవెన్యూ పరమైన ఎటువంటి సమస్యలైనా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ తరహా అర్జీల స్వీకరణ రాష్ట్రంలోనే తొలిసారిగా చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే త్వరలోనే దయల్ యువర్ ఆర్డీఓ కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మంగళవారం ఉదయం పది గంటల నుండి 11 గంటల వరకూ దయల్ యువర్ ఆర్డీఓ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డివిజన్ ప్రజల సౌకర్యార్థం చేపడుతోన్న ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ స్వర్ణ, గూడూరు తహశీల్దార్ బాల లీలారాణి, ఆర్డీఓ సీసీ అఖిల్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి: సిపిఐ

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ పుత్తూరు పట్టణ ప్రాంతంలోని మున్సిపాలిటీ 10 వార్డులో, హెచ్ డబ్ల్యు గ్రామంలో త్రాగడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సిపిఐ పార్టీ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి మహేష్ తెలిపారు ఈ సందర్భంగా డి మహేష్ మాట్లాడుతూ గ్రామంలో త్రాగునీరు ఆరు రోజులుగా మున్సిపాలిటీ వారు అందించలేదని ఇది చాలా దారుణమని ఈ వేసవికాలంలో కూడా త్రాగునీరు కొరత లేకుండా చూడాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు. ఇంటి పన్ను కొళాయి పన్నుకట్టించుకుంటున్నారని తెలిపారు .కొత్త వాటర్ కనెక్షన్ కోసం మంజూరు చేసుకున్న ఇంతవరకు మంజూరు చేయలేదని గతంలో పబ్లిక్ టాపు కొళాయిని కూడా డమ్మీ చేశారని దానినైనా రీఓపెనింగ్ చేయాలని కోరారు. డ్రైనేజీ లేక డ్రైనేజీ నీళ్లు పొలాలపై వెళ్తున్నదని నిత్యం వాళ్లతో గ్రామస్తులు ఘర్షణ వాతావరణం జరుగుతున్నదని మున్సిపాలిటీ వారు వెంటనే కొత్త డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరారు. పై సమస్యలను అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు సెల్వరాజ్ ఆచారి రవి, గ్రామస్తులు నాగజ్యోతి, భాను, చల్లకిలి పాల్గొన్నారు.

ఉగాది పురస్కారం అందుకున్న షార్ గ్రూప్ డైరెక్టర్

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ గ్రూప్ డైరెక్టర్ గోపికృష్ణ ను ఉగాది పురస్కారం కు , గుంటూరుకు చెందిన తెలుగు మరియు సంస్కృత అకాడమీ వారు 2023 ఉగాది పురస్కారాలు , వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిని ఎంపిక చేసి ఉగాది పురస్కారాలను అందిస్తున్నారు, ఇందులో భాగంగా విద్య,శాస్త్ర సాంకేతిక రంగం లో గోపికృష్ణ ను ఎంపిక చేసి ఈ నెల 25 న గుంటూరు లోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆవరణం లో జరిగిన ప్రత్యేక కార్యక్రమం లో మంగళవారం ఉగాది పురస్కారానీ మంత్రివర్యులు తానేటి వనిత, తెలుగు సాంస్కృతిక అకాడమీ చైర్మన్ లక్ష్మీపార్వతి చేతుల మీదగా అందజేశారు. గోపికృష్ణ ను ఇస్రో శాస్త్రవేత్తలు ,ఉద్యోగస్తులు అభినందనలు తెలిపారు.

తిరుమలలో చక్కర్లు కొట్టిన హెలికాప్టర్లు

విశాలాంధ్ర - తిరుపతి : నో ఫ్లయింగ్ జోన్ అయిన తిరుమల కొండపై మంగళవారం మూడు హెలికాప్టర్లు చక్కర్లు కొట్టడం చర్చనీయాంశంగా మారింది. శ్రీవారి ఆలయ సమీపంలో హెలికాప్టర్ లు వెళ్లడంపై తొలుత పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఆలయానికి సమీప ప్రాంతం మీదుగా వెళ్ళిన హెలికాప్టర్లు ఏయిర్ ఫోర్స్ విభాగానికి చెందినవిగా గుర్తించారు. కడప నుంచి చెన్నైకి వెళ్ళే సమయంలో తిరుమల మీదుగా ప్రయాణించినట్లు సమాచారం.

'దళారుల పట్ల అప్రమత్తంగా ఉండండి'

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రేణిగుంట మండలంలో ఇంటి పట్టాల పేరుతో మోసగిస్తున్న దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విశ్రాంత తహసీల్దారు ఎం.నరసింహులు నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను పదవీవిరమణ పొంది 4 ఏళ్ల 4 నెలలు అయిందన్నారు. తాను రేణిగుంట తహసీల్దార్ గా పనిచేసే సమయంలో అప్పటి ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఎక్కువగా తారకరామ నగర్ లో అర్హులై... నివాసం ఉన్న వారికి, మరికొన్ని గ్రామాల్లో ఎలక్ట్రిసిటీ కనెక్షన్ కొరకు సర్టిఫికెట్లు ఎలాంటి విమర్శలు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇంటి పట్టా రిజిస్టర్ లో నమోదు చేసి ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ప్రస్తుతం తన పేరిట, అలాగే ఇతర తహసీల్దార్ ల పేరిట కొందరు సంతకాలు ఫోర్జరీ చేసి అక్రమంగా దళారులు అమాయక ప్రజలను మోసగిస్తున్నట్లు తెలిసినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఈ విషయమై తాను గతంలో అప్పటి ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు చేసినట్లు పేర్కొన్నారు. రేణిగుంట కొత్త తహసీల్దార్ కార్యాలయం ఏవెంకటాపురం, అన్నశాంపల్లి పక్కన కూడా ఇంటి పట్టాలు తన హయాంలో మంజూరు చేసినట్లు పట్టాలు సృష్టిస్తున్నట్లు తెలిసిందన్నారు. తాను ఆ పట్టాలు ఇవ్వలేదన్నారు. దళారుల మాట విని ప్రజలు మోసపోకూడదని ఆయన కోరారు. ఇంటి స్థలం రిజిస్టరులో చెక్ చేసుకోవాలని ఆయన సూచించారు. అవసరమైతే సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరపాలని నరసింహులు నాయుడు విజ్ఞప్తి చేశారు. తాను గత 4 సంవత్సరాలుగా బెంగుళూరు లో పిల్లల వద్ద ఉన్నానన్నారు. పదవీ విరమణ పొందిన తరువాత తాను ఎలాంటి సంతకాలు చెయ్యలేదన్నారు. ప్రజలు ఇది గమనించాలని కోరారు.

లైట్లు లేకపోవడంతో యూనివర్సిటీ విద్యార్థుల అవస్థలు

విశాలాంధ్ర - తిరుపతి: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నందు విసి టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది గత కొన్ని నెలలుగా యూనివర్సిటీలో లైట్లు లేక లైబ్రరీ వద్ద ప్రకాశం భవనం వద్ద లైట్లు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్, తెలుగు యువత నాగేంద్ర మాట్లాడుతూ ఎగ్జామ్ సమయం దగ్గర పడుతున్నాం తో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది గురవుతున్నారు అలాగే లేడీస్ హాస్టల్ వెళ్లడానికి లైట్లు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు అదేవిధంగా హాస్టల్లో ఉంటున్న విద్యార్థులు నీటి సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులకు సరైన నీటిని అందించాలని డిమాండ్ చేస్తున్నారు ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సీఆర్. రెడ్డి మృతి బాధాకరం: మాజీ ఎంపీ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు డివిజన్ లో ప్రజా డాక్టర్ గా పేరు పొందిన డాక్టర్ సిఆర్ రెడ్డి మృతి బాధాకరమని ఆయన జ్ఞాపకార్థంగా పట్టణంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ వెల్లడించారు. గూడూరు పట్టణంలో అనారోగ్యంతో మృతి చెందిన డాక్టర్ సిఆర్. రెడ్డి భౌతికకాయాన్ని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్, గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, పట్టణ ప్రముఖులు, డాక్టర్లు, ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి చింత మోహన్ మాట్లాడుతూ డాక్టర్ సిఆర్. రెడ్డిఅనేక ఏళ్లుగా వైద్య వృత్తిలో ఉంటూ పేద ప్రజలకు విశేష సేవలు అందించారన్నారు. ఆయన అందించిన సేవలు ఎప్పటికి మర్చిపోలేనివన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నామని తెలిపారు.

శ్రీరామ కళాశాల ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - రేణిగుంట : శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో పేద ప్రజల కొరకు ఉచిత కంటి వైద్య శిబిరంను నిర్వహించారు. రేణిగుంట మండలం కరకంబాడీ - తిరుపతి రహదారిలో ఉన్న శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవ విభాగం రెండవ రోజు సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరంను నిర్వహించారు. తిరుపతి వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారి సహకారంతో పెరుమాళ్ళపల్లి గ్రామంలో శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా గ్రామ సర్పంచ్ బండి. శశి ఆనంద్ రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించి కార్యక్రమం ఉద్దేశించి ప్రసంగించారు. గ్రామంలోని ప్రజల కొరకు ఈ కార్యక్రమంను నిర్వహించిన శ్రీరామ కాలేజ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శశి ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ అనంతరం గ్రామ ప్రజలు శిబిరంలో పాల్గొని కంటి పరీక్ష చేయించుకున్నారు. కళాశాల డైరెక్టర్ మన్నెం. అరవిందుకుమార్ రెడ్డి వృద్ధులకు ఉచితంగా కంటి చుక్కల మందు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ చక్రీశ్రీధర్, కన్వీనర్ డి. పూర్ణచంద్రారెడ్డి , హాస్పిటల్ పి.ఆర్.ఓ మస్తాన్ మరియు జాతీయ సేవ విభాగం వాలంటీర్స్ పాల్గొన్నారు.

జ్ఞానాంబకండ్రిగలో తాగునీరు కలుషితం

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర- తొట్టంబేడు: తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం పంచాయతీ పరిధిలోని జ్ఞానాంబకండ్రిగలో పైపుల లీకేజీ కారణంగా తాగునీరు కలుషితం అవుతోంది. ఈ గ్రామంలో ఈ సమస్య సుమారు ఎనిమిది నెలలుగా ఉంది. పైపులకు మరమ్మతులు చేసి తాగునీరు కలుషితం కాకుండా చూడాలని జ్ఞానాంబకండ్రిగ వాసులు ఎనిమిది నెలలుగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. అయినా వీరు స్పందించడం లేదు. కలుషిత తాగడం వలన జ్ఞానాంబకండ్రిగ వాసులు రోగాల బారిన పడుతున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి ఈ సమస్యను పరిష్కరించ వలసి ఉంది.

వైభవంగా ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మగుడిలో మంగళవారం జగద్గురువు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మగుడిలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి జగద్గురువు ఆదిశంకరాచార్యులు వారి చిత్రపటానికి విశేష పూజలు నిర్వహించి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. ఆయన గొప్పతనాన్ని ఈ సందర్భంగా నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.వి. సాగర్ బాబు దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు కరుణాకర గురుకుల్, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శ్రీకాళహస్తికి చెందిన డాక్టర్ మాడ దుర్వాసుల శెట్టి, లీలావతి అనే భక్తులు మంగళవారం రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ సాగర్ బాబు ఈ విరాళం స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీఎం తో నేదురుమల్లి భేటీ

విశాలాంధ్ర - వెంకటగిరి : ఈరోజు తాడేపల్లి లోని సీఎం క్యాంప్ ఆఫీస్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి మే నెల ఒకటో తారీకు నుంచి ఏడో తారీకు వరకు జరుగు పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించి స్వామివారి శేష వస్త్రము ప్రసాదాలను ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ చైర్మన్, తిరుపతి జిల్లా వైయస్సార్సీపి అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త గౌరవ శ్రీ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అందించారు.

మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-చిల్లకూరు: చిల్లకూరు మండల సర్వసభ్య సమావేశం యంపిపి తుపాకుల వెంకటరమణమ్మ అధ్యక్షతన మంగళవారం మండలపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో జరిగింది. గ్రుహనిర్మాణశాఖ, వ్యవసాయ, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య, రహదారులు భవనాలు, విద్యుత్, ఉపాది హామీ పథకం, పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైస్ యంపిపి వేమారెడ్డి కుమార్ మాట్లాడుతూ మండలం లో రహదారుల మరమ్మతులు పూర్తి చేయాలని ఆర్ అండ్ బి ఎఇ కి సూచించారు. చింతవరం యంపిటిసి పాలూరు మాదవి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. పది రోజుల్లో చేస్తామని విద్యుత్ శాఖ ఎఇ మునిశేఖర్ తెలిపారు. గూడూరు ఎయంసి ఓడూరు యమునమ్మ, వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్, జడ్పీటిసి మన్నెం శ్రీనివాసులు, వైస్ యంపిపి పోలుబోయిన చెంగయ్య, యంపిటిసిలు, సర్పంచ్ లు , అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

27న శిక్షణా శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర - గూడూరు : ఈ నెల 27వ తేదీన 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులకు కుట్టు మిషన్, ఫ్యాషన్ డిజైనింగ్ పై ఉచిత శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు సునీతా సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట ఉన్న సునీతా సేవా సంస్థ లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.